# ప్రార్థనాంజలి



ఆదిలాబాద్ గురుపీఠం

మొదటి ముద్రణ : జీవస్వరం సువార్త స్వస్థతా కూటములు

ఫిబ్రవరి 23-25, 2018

ప్రతులు : 5000

రెండవ ముద్రణ : 10000 ప్రతులు (ఏప్రిల్ 2021)

ముద్రణానుమతి : మహా ఘన ప్రిన్స్ అంతోని తండ్రి గారు

ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు

***

ఆదిలాబాద్ గురుపీఠ విశ్వాసుల ఉపయోగార్థమై

ఈ ప్రార్థన పుస్తకము ముద్రించబడినది

**ప్రతులకు సంప్రదించండి**

జీవస్వరం
బిషప్స్‌హౌస్
మంచిర్యాల- 504 208
జిల్లా: మంచిర్యాల, తెలంగాణ
ఫోన్ : 9398764408

**Jeevaswaram**
**Bishop's House**
**Mancherial - 504 208**
**Dist. Mancherial, T.S.**
**Cell : 9398764408**

***

# విషయసూచిక

I. ప్రాథమిక ప్రార్థనలు
1. సిలువ గుర్తు
2. పరలోక ప్రార్థన
3. మంగళవార్త జపము
4. త్రిత్వ స్తోత్రము
5. విశ్వాస సంగ్రహము
6. త్రికాల జపము
7. పాస్క త్రికాల జపము
8. పాపసంకీర్తనము చేసే ముందు చెప్పే జపము
9. ఉత్తమ మనస్తాప జపము
10. దేవమాత శరణుగోరు జపము

2. విశ్వాస సత్యాలు

3. వివిధ సందర్భాల కొరకు ప్రార్థనలు
1. ఉదయకాల సమర్పణ
2. ప్రయాణమునకు ముందు ప్రార్థన
3. చదువుకొనుటకు ముందు ప్రార్థన

4. భోజనానికి ముందు ప్రార్థన

5. గురువుల కొరకు ప్రార్థన

6. రోగుల కొరకు ప్రార్థన

7. పరీక్షలకు వెళ్ళే ముందు చేయు ప్రార్థన

4. కుటుంబ ప్రార్థన

1. జపమాల

2. దివ్య కారుణ్య జపమాల

3. పవిత్ర గ్రంథ పఠనము

4. వేడుదల ప్రార్థన

5. యేసునాథుని తిరుహృదయమునకు సమర్పించు జపము

6. ముగింపు ప్రార్థన

5. సిలువ మార్గం

6. పాటలు

# కాపరి స్వరం

ప్రార్థన ఆధ్యాత్మిక జీవితానికి జీవవాయువులాంటిది. ప్రార్థించేవారు దైవీక జీవమును పొంది శాంతి సంతోషాలతో జీవించగలుగుతారు. ప్రార్థన దేవుని యందు నివసించడానికి అతి ముఖ్యమైన మార్గము. దేవుని యందు నివసించువారు ఎక్కువగా ఫలిస్తారు (యోహాను 15,5). దేవునికి మొరపెట్టే వారి మనవులను ఆయన ఆలకిస్తారు (యిర్మీయా 29,12). "మీరు ప్రార్థింపుడు. ప్రార్థనలో మీరు దేనినైన అడిగినను దానిని మీరు తప్పక పొందుదురు అని విశ్వసింపుడు" (మార్కు 11,24) అని యేసు ప్రభు చెప్పారు. "ఆత్మ ప్రేరణను అనుసరించి అన్ని సమయములందు, విజ్ఞాపనములతో ప్రార్థింపుడు...దైవ ప్రజలందరి కొరకై సదా ప్రార్థింపుడు" అని పునీత పౌలు గారు నేర్పిస్తున్నారు (ఎఫెసీ 6,18). ఈ విధంగా ప్రార్థించడానికి దైవ ప్రజలకు దోహదపడే విధంగా మేత్రాసన స్థాయిలో ఒక ప్రార్థనా పుస్తకాన్ని సిద్ధం చేయాలనేది చాలా రోజుల కోరిక. అనేకుల కృషి వలన ఆ కోరిక ఇప్పుడు నెరవేరింది. ఆదిలాబాద్ గురుపీఠ దైవప్రజల ఆధ్యాత్మిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని "ప్రార్థనాంజలి"అనే ఈ ప్రార్థనా పుస్తకం తయారు చేయబడింది. ప్రార్థనాశీస్సులతో నేను ఈ "ప్రార్థనాంజలి"ని ఆదిలాబాద్ గురుపీఠ దైవ ప్రజలకు సమర్పిస్తున్నాను.

ఈ ప్రార్థనా పుస్తకము మీ కుటుంబానికి గొప్పవరంగా మారాలని కోరుతున్నాను. దీనిని కుటుంబంలోని ఒక అమూల్య నిధిగా పరిగణించి దీనిని ఉపయోగించుకొని, ఆధ్యాత్మిక ఎదుగుదల కోసం కృషి చేయండి. ఇందులోని మొదటి భాగంలో అందరు నేర్చుకోవాల్సిన ప్రాథమిక ప్రార్థనలున్నాయి. ఈ ప్రార్థనలను అందరు కంఠస్థం చేయాలి. రెండవ భాగంలో, విశ్వాసులందరు తెలుసుకోవాల్సిన విశ్వాస సత్యాలు కనిపిస్తాయి. ఈ సత్యాలను అందరు శ్రద్ధగా చదివి నేర్చుకోవాలి. మూడవ భాగంలో వివిధ సందర్భాల కొరకు ప్రార్థనలు కలవు. అనుదిన జీవితంలోని ప్రత్యేకమైన సందర్భాలలో ఈ ప్రార్థనలు చేయడం మనకు అలవాటుగా మారాలి. ప్రతిదినం కుటుంబంలో ప్రార్థించాల్సిన ప్రార్థనలు నాలుగవ భాగంలో ఉన్నాయి. అన్ని కుటుంబాల్లో ప్రతి దినం కుటుంబ ప్రార్థన జరగాలి. కలిసి ప్రార్థించే కుటుంబం కలిసి జీవిస్తుంది. కుటుంబ సభ్యులందరు కలిసి ప్రతిదినం సాయంత్రం కుటుంబ ప్రార్థన చేయడం కుటుంబాల సమగ్ర అభివృద్ధికి తోడ్పడుతుంది. కాబట్టి కుటుంబ ప్రార్థన అనే ఈ నాలుగవ భాగమును ఉపయోగించి ప్రతిదినం కుటుంబ ప్రార్థన చేయాలని నేను అన్ని కుటుంబాలను కోరుతున్నాను. ఈ భాగంలోని జపమాల, పవిత్ర గ్రంథ పఠనము, వేడుదల ప్రార్థన, కుటుంబమును యేసు నాథుని తిరు హృదయమునకు

సమర్పించు జపము ప్రతిదిన కుటుంబ ప్రార్థనలో ప్రార్థించాలి. దివ్య కారుణ్య జపమాలను ప్రతి శుక్రవారం మరియు ఇతర ప్రత్యేక సందర్భాల్లోను ప్రార్థించవచ్చు. తపస్సు కాలంలోని శుక్రవారాల్లో సిలువ మార్గము చెప్పడానికి వీలుగా ఐదవ భాగంలో సిలువ మార్గం ముద్రించడం జరిగింది.

ఈ విధంగా ఈ ప్రార్థనా పుస్తకం మీ ఆధ్యాత్మిక అభివృద్ధికి తోడ్పడాలని ప్రార్థిస్తున్నాను. ఈ పుస్తకాన్ని మీ ఆత్మీయ మిత్రునిగా భావించి ఎల్లప్పుడూ ప్రార్థనా శక్తితో జీవించే అలవాటును స్వంతం చేసుకోండి. దీని కోసం కృషి చేసిన అందరికి నేను కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. దేవుడు మనందరిని ధారాళంగా దీవించునుగాక! ఆమెన్.

క్రీస్తునందు మీ తండ్రి

**బిషప్ ప్రిన్స్ అంతోని**

ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు



# I. ప్రాథమిక ప్రార్థనలు

## 1. సిలువ గుర్తు

పిత, పుత్ర, పవిత్రాత్మ నామమున, ఆమెన్.

## 2. పరలోక జపము

పరలోక మందున్న మా తండ్రీ! మీ నామము పూజింపబడునుగాక ! మీ రాజ్యము వచ్చును గాక ! మీ చిత్తము పరలోకమందు నెరవేరునట్లు భూలోకమందును నెరవేరును గాక.

నానాటికి కావలసిన మా అన్నము, మాకు నేటికివ్వండి. మా యొద్ద అప్పుపడినవారిని మేము మన్నించునట్లు, మా అప్పులను మీరు మన్నించండి. మమ్ము శోధనయందు ప్రవేశింపనివ్వక, కీడులో నుండి మమ్ము రక్షించండి. ఏలయన నిరంతరము మీదే రాజ్యము, మీదే అధికారము, మీదే మహిమ, ఆమెన్.

## 3. మంగళవార్త జపము

దేవవరప్రసాదముచేత నిండిన మరియమ్మా! వందనము. ఏలినవారు మీతో ఉన్నారు. స్త్రీలలో ఆశీర్వదింపబడినవారు మీరే. మీ గర్భఫలమగు యేసు ఆశీర్వదింపబడినవారు అగునే.

పరిశుద్ధ మరియమ్మా, సర్వేశ్వరుని యొక్క మాతా, పాపాత్ములమై యుండెడు మా కొరకు ఇప్పుడును మా మరణ సమయమందును ప్రార్థించండి. ఆమెన్.

## 4. త్రిత్వ స్తోత్రము

పిత, పుత్ర, పవిత్రాత్మలకు మహిమ కలుగును గాక. ఆదిలో కలిగినట్లు ఇప్పుడును, ఎప్పుడును, సదాకాలము కలుగునుగాక. ఆమెన్.

## 5. విశ్వాస సంగ్రహము

పరలోకమును, భూలోకమును సృష్టించిన సర్వశక్తిగల పితయైన సర్వేశ్వరుని విశ్వసించుచున్నాను. అతని యొక్క ఏక సుతుడును మనయొక్క నాథుడునైన యేసుక్రీస్తును విశ్వసించుచున్నాను. ఇతడు పవిత్రాత్మ వలన గర్భమై కన్యమరియమ్మ నుండి పుట్టెను. పోన్సియు పిలాతుని అధికారమునకు లోనై పాటుబడి స్లీవ మీద కొట్టబడి మరణము పొంది సమాధిలో ఉంచబడెను. పాతాళమునకు దిగి, మూడవనాడు చనిపోయినవారలలో నుండి లేచెను. పరలోకమునకు ఎక్కి సర్వశక్తిగల పితయైన సర్వేశ్వరుని యొక్క కుడిప్రక్కన కూర్చుండి యున్నారు. అక్కడ నుండి జీవించు వారలకును చనిపోయిన వారలకును తీర్పు చేయుటకు వచ్చును. పవిత్రాత్మను విశ్వసించుచున్నాను. పరిశుద్ధ కతోలిక సభను, పునీతుల సంబంధ ప్రయోజనమును విశ్వసించుచున్నాను. పాపముల మన్నింపును విశ్వసించుచున్నాను. శరీరము యొక్క ఉత్థానమును విశ్వసించుచున్నాను. నిత్యజీవమును విశ్వసించుచున్నాను. ఆమెన్.

**6. త్రికాల జపము**

**ఏలినవారి సన్మనస్కుడు మరియమ్మతో మంగళవార్త చెప్పెను**

ఆయమ్మ పవిత్రాత్మ వలన గర్భము ధరించెను. (మంగళ)

**ఇదిగో ఏలినవారి దాసురాలను**

నీ మాట చొప్పున నాకు అగును గాక. (మంగళ)

**పుత్రుడైన సర్వేశ్వరుడు మనుష్యావతారము ఎత్తెను**

మరియు మనతో కూడ వాసమై యుండెను. (మంగళ)

**యేసు క్రీస్తునాథుని దివ్య వాగ్ధత్తములకు మేము పాత్రులమగునట్లు**

సర్వేశ్వరుని యొక్క పరిశుద్ధ మాతా! మా కొరకు ప్రార్థించండి.

**ప్రార్థించుదుము:** సర్వేశ్వర స్వామి! సన్మనస్కుడు చెప్పి నందు వలన మీ పుత్రుడైన యేసు క్రీస్తుని మనుష్యావతారమును తెలిసికొంటిమి! అతని పాటుల వలనను, స్లీవవలనను, ఉత్థానము యొక్క మహిమను మేము పొందునట్లుగా మాకు మీ వరప్రసాదములను దయచేయ నవధరింపవలయునని దేవరవారిని వేడుకొనుచున్నాము. ఆమెన్.

**త్రిత్వ స్తోత్రము (3)**

**7. పాస్కత్రికాల జపము**

(పాస్క పండుగ నుండి త్రియేక సర్వేశ్వరుని పండుగ వరకు)

**పరలోకము యొక్క రాజ్ఞీ! సంతోషించండి** – హల్లేలూయ

**ఏలయనిన భాగ్యవతియైన మీ గర్భమునందు అవతరించిన వారు** – హల్లేలూయ

**ఆనతిచ్చిన ప్రకారము ఉత్థానమైనారు** – హల్లేలూయ

**మా కొరకు సర్వేశ్వరుని మనవి చేయండి** – హల్లేలూయ

**కన్యకయై యుండెడు మరియమ్మా!**

**ఆనందించి సంతోషించండి** – హల్లేలూయ

**ఏలయనిన ఏలినవారు నిజముగా ఉత్థానమైనారు**– హల్లేలూయ

**ప్రార్థించుదము:** సర్వేశ్వరా స్వామి, మీ దివ్యకుమారుడును మా నాథుడునైన యేసు క్రీస్తుని ఉత్థానముచేత లోకమును సంతోషపరచ చిత్తగించితిరే! వారి దివ్యమాతయైన కన్యమరియమ్మ వలన నిత్యజీవమైన పరలోక భాగ్యమును మేము పొందునట్లుగా అనుగ్రహించండి. యేసుక్రీస్తు నాథుని దివ్యముఖమును చూచి ఈ మనవిని మాకు దయచేయండి. ఆమెన్.

**త్రిత్వ స్తోత్రము (3)**

## 8. పాపసంకీర్తనము చేసే ముందు చెప్పే జపము

సర్వశక్తిగల సర్వేశ్వరునితోను, ఎప్పుడును కన్యకయై యుండెడు పరిశుద్ధ మరియమ్మతోను, అతి దూతయగు మిఖాయిలుతోను, బప్తిస్మ యోహానుతోను, అపోస్తలులైన పునీత పేతురుతోను, పునీత పౌలుతోను, పునీత తోమాసుతోను, సకల పునీతులతోను, తండ్రీ! మీతోను నేను పాపసంకీర్తనం చేయుచున్నాను. ఏలయనగా తలంపుచేతను, వాక్కుచేతను, క్రియల చేతను, లోపము చేతను బహుపాపములు చేసితిని.


(రొమ్ముకొట్టుకొనుచు)

ఇది నా తప్పు, ఇది నా తప్పు, ఇది నా గొప్ప తప్పు.

అందుచేత, ఎప్పుడును నిత్య కన్యకయై యుండెడు పరిశుద్ధ మరియమ్మయు, సకల దూతలును, పునీతులును సహోదరీ సహోదరులారా మీరును నా కొరకు మన కర్తయైన సర్వేశ్వరుని ప్రార్థింపవలయుని బ్రతిమాలు కొనుచున్నాము. ఆమెన్.

### 9. ఉత్తమ మనస్తాప జపము

సర్వేశ్వరా స్వామీ! దేవరవారు మితిలేని సకలమేలుల స్వరూపులై ఉండుటవలన, సకల వస్తువుల కంటే మిమ్ము అధికముగా ప్రేమించుచున్నాను. మీకు నా పాపములచేత ద్రోహము చేసినందువలన, మహా మనస్తాపపడుచున్నాను స్వామి. మహా దు:ఖపడుచున్నాను స్వామి. మహా ఉత్తమ మనస్తాపపడుచున్నాను స్వామీ. ఇక మీదట ఒక్కనాటికిని ఇటువంటి పాపములను చేయనని నిండు మనస్సుతో గట్టి ప్రతిజ్ఞ చేయుచున్నాను. ఆమెన్



## 10. దేవమాత శరణుగోరు జపము

మిక్కిలి నెనరుగల తల్లీ! మీ శరణుకు పరుగెత్తి వచ్చి మీ ఉపకార సహాయమును అడిగివారలలో ఒక్కరైనను మీ వలన చేయి విడువబడినట్లు ఎప్పుడును లోకములో వినినది లేదని తలంచండి. కన్యకల రాజ్ఞీ! దయారసముగల తల్లీ! ఇటువంటి నమ్మికచేత ప్రేరేపింపబడి, మీ పవిత్ర పాదములను సమీపించి వచ్చుచున్నాను. నిట్టూర్పు విడిచి ప్రలాపించి యేడ్చెడు పాపియైన నేను మీ కనికరమునకు కాచుకొని మీ సముఖములో నిలుచున్నాను. మనుష్యావతారమెత్తిన పుత్రుడైన సర్వేశ్వరుని తల్లీ! నా విజ్ఞాపనమును త్యజింపక దయాపరియై విననవధరించండి. ఆమెన్.



# II. విశ్వాస సత్యాలు

**1. సర్వేశ్వరుని ఆజ్ఞలు -10**

1. సర్వేశ్వరుని మాత్రము ఆరాధించుదువుగాక.
2. సర్వేశ్వరుని నామము వ్యర్థముగా పలుకక యుందువుగాక.
3. సర్వేశ్వరుని పండుగ దినములను పరిశుద్ధ పరుచుదువుగాక.
4. తల్లిదండ్రులను గౌరవించుదువుగాక.
5. నరహత్య  చేయక యుందువుగాక.
6. మోహ పాపములను చేయక యుందువుగాక
7. దొంగిలింపక యుందువుగాక.
8. అబద్ధ సాక్ష్యము పలుకక యుందువుగాక.
9. మోహ తలంపులను తలంపక యుందువుగాక.
10. పరుల సొమ్మును ఆశింపక యుందువుగాక.

**ఈ పది ఆజ్ఞలు రెండు ఆజ్ఞలలో అణిగియున్నవి**

1. సకల వస్తువుల కంటే సర్వేశ్వరుని అధికముగా ప్రేమించుదువుగాక.
2. నీ వలె సమస్త జనులను ప్రేమించుదువుగాక.

## 2. శ్రీసభ కట్టడలు-6

1. ఆదివారములలోను, అప్పుపండుగలలోను శరీర కష్టమైన పనులను చేయక, నిండు పూజలో పాల్గొందువు గాక.
2. ఏడాదికి ఒక్కసారియైన పాపసంకీర్తనం చేయుదువు గాక.
3. పాస్క పండుగ దినములో దివ్యసత్ప్రసాదమును లోకొందువు గాక.
4. విభూది సోమవారము మరియు పెద్ద శుక్రవారము నాడు మాంసమును భుజింపక ఉపవాసము ఆచరించుందువు గాక. అన్ని శుక్రవారములలో మాంసము భుజింపక యుందువు గాక.

5 తిరుసభ చట్టములు మీరి వివాహము చేసుకొనక యుందువు గాక.

6. విచారణ గురువులకు సహాయము చేయుదువు గాక.

**3. దివ్య సంస్కారములు-7**

1. జ్ఞాన స్నానము 2. భద్రమైన అభ్యంగనము (తైలాభిషేకము, ధృఢీకరణ సంస్కారము)
3. దివ్య సత్ప్రసాదము 4. పాప సంకీర్తనము
5. స్వస్థత సంస్కారము (అవస్థాభ్యంగము)
6. జ్ఞాన వివాహము 7. గురుపట్టాభిషేకము

**4. దివ్య సత్ప్రసాదము స్వీకరించుటకు యోగ్యతలు-3**

1. దేవుని కృపను కలిగి యుండుట
2. దివ్య సత్ప్రసాదము లోకొనుటకు ముందు ఒక గంట ఉపవాసము ఉండుట
3. తగిన భక్తి శ్రద్ధలతో సంసిద్ధత కలిగి ఉండుట

**5. శారీరక సంబంధమైన కరుణ క్రియలు-7**

1. ఆకలితోనున్న వారికి ఆహారము పెట్టుట
2. దాహముతోనున్న వారికి దాహము తీర్చుట
3. వస్త్రములేనివారికి వస్త్రము నిచ్చుట
4. నిరాశ్రయులకు ఆశ్రయము ఇచ్చుట
5. చెఱసాలలోనున్న వారిని, వ్యాధిగ్రస్తులను పరామర్శించుట

6. పేదవారిని, అవసరములలో నున్న వారిని ఆదుకొనుట
7. మరణించిన వారిని సమాధిచేయుట, అంతిమ యాత్రలో పాల్గొనుట

**6. ఆధ్యాత్మిక సంబంధమైన కరుణ క్రియలు–7**

1. అజ్ఞానములోనున్నవారికి జ్ఞాన బోధ చేయుట
2. అవిశ్వాసులకు సందేశమందించుట
3. నిరాశ, నిస్పృహలలోనున్న వారికి అభయమిచ్చుట
4. దుష్టక్రియలు చేయువారిని ఖండించుట
5. ద్రోహము చేసిన వారిని క్షమించుట
6. ఇతరులను ఓర్పుతో భరించుట
7. సజీవుల కొరకు, మృతుల కొరకు ప్రార్థించుట

**7. మంచి పాపసంకీర్తనము చేయుటకు కావలసిన కార్యములు–5**

1. తాను చేసిన పాపములను జ్ఞాపకము చేసికొనుట
2. చేసిన పాపముల కొరకు పశ్చాత్తాపపడుట
3. ఇక పాపములు చేయనని గట్టి ప్రతిజ్ఞ చేయుట
4. తాను చేసిన చావైన పాపములు అన్నింటిని గురువుకు బయలుపరుచుట
5. గురువు ఉపదేశించిన ప్రాయశ్చిత్తమును నెరవేర్చుట

**8. మూలపాపములు–7** **మూలపుణ్యములు–7**

| మూలపాపములు | మూలపుణ్యములు |
|---|---|
| 1. అహంకారము | 1. దీనత |
| 2. లోభితనము | 2. ఔదార్యం |
| 3. మోహము | 3. విరక్తత్వము |
| 4. క్రోధము | 4. ఓర్పు |
| 5. భోజనప్రియము | 5. మితభోజనము |
| 6. మాత్సర్యము | 6. ప్రేమ |
| 7. సోమరితనము | 7. ఉత్సాహము |

**9. పవిత్రాత్మ వరములు –7**

| | | |
|---|---|---|
| 1. జ్ఞానము | 2. బుద్ధి | 3. ఆలోచన |
| 4. ధృఢత్వం | 5. తెలివి | 6. దైవభక్తి |
| 7. దైవభయం | | |

**10. పవిత్రాత్మ ఫలములు –12**

| | | |
|---|---|---|
| 1. ప్రేమ | 2. ఆనందము | 3. శాంతి |
| 4. క్షమ | 5. సహనము | 6. మంచితనము |
| 7. కనికరము | 8. సాత్వికత | 9. విశ్వసనీయత |
| 10. నిగ్రహము | 11. మర్యాద | 12. విరక్తత్వము |

## 11. పవిత్రాత్మ సర్వేశ్వరునికి విరోధమైన తప్పిదములు-6

1. పరలోక రాజ్యములో స్థానం సంపాదించుకొనుట అసంభవమనుట.
2. సత్కార్యములు చేయకుండ స్వర్గమునకు వెళ్ళవచ్చు అను భ్రమను కలిగి ఉండుట.
3. తెలిసి సత్యమును తిరస్కరించుట లేదా ఖండించుట.
4. పరుల ప్రగతిని చూచి ఈర్ష్యపడుట.
5. పాపములోనే జీవించుట.
6. మరణము వరకు పశ్చాత్తప పడకుండుట.

## 12. స్వర్గరాజ్యప్రవేశమునకు ఆటంకమైన తప్పిదములు-4

1. స్వయం ప్రేరణతో నరహత్య చేయుట.
2. ప్రకృతి విరుద్ధమైన మోహపాపములు చేయుట.
3. అనాథలను, విధవలను, పేదవారిని ఆదరించకపోవుట.
4. శ్రమకు తగిన వేతనములను చెల్లించకుండ శ్రామికులను దోచుకొనుట.

## 13. సత్య తిరుసభ యొక్క లక్షణములు-4

1. ఏకైక తిరుసభ
2. పరిశుద్ధ తిరుసభ
3. సార్వత్రిక తిరుసభ
4. అపోస్తోలిక తిరుసభ

**14. ప్రధాన సుకృత పుణ్యములు-4**

1. వివేకము 2. నీతి

3. దృఢత్వము 4. నిగ్రహము

**15. దివ్య సద్గుణములు -3**

1. విశ్వాసము 2. నమ్మిక 3. ప్రేమ

**16. ప్రధాన పుణ్యకార్యములు -3**

1. ఉపవాసము 2. ప్రార్థన 3. దానధర్మము

**17. మనుష్యుని కడగతులు -4**

1. మరణము 2. తీర్పు

3. స్వర్గము 4. నరకము

**18. విశిష్టమైన సువిశేషోపదేశములు -3**

1. దైవరాజ్యము కొరకు సంపూర్ణ విధేయతను చూపుట
2. దైవరాజ్యము కొరకు సంపూర్ణ విరక్తత్వమును పాటించుట.
3. దైవరాజ్యము కొరకు స్వేచ్ఛాపూర్వకమైన దారిద్ర్యమును అనుసరించుట.

# III. వివిధ సందర్భాల కొరకు ప్రార్థనలు

## 1. ఉదయకాల సమర్పణ

ఓ నా యేసువా! ఈ దినము నేను చేయు ప్రార్థనలను, చేయు పనులను, పడు కష్టములను మా పాపముల పరిహారము కొరకు, సమస్త ప్రజల కొరకు మీకు సమర్పిస్తున్నాను.

ప్రత్యేకముగా పరిశుద్ధ పాపు గారి సాధారణ తలంపు కొరకు, ప్రత్యేక తలంపు కొరకు పై సత్కార్యములను మీకు సమర్పిస్తున్నాను. పరిశుద్ధ కన్య మరియమ్మా! సర్వేశ్వరుని మాతా! మీకు నన్ను సమర్పించుకొంటున్నాను. మీ బిడ్డగా నన్ను కాపాడండి. ఈ దినము ఏ పాపములో పడకుండ నా కొరకు ప్రార్థించండి. దైవ కృప చేత నాకు కావలిగా నుండెడు నా కావలిదూత నాకు జ్ఞాన వెలుతురునిచ్చి, కాపాడి నడిపించును గాక. ఆమెన్.

## 2. ప్రయాణమునకు ముందు ప్రార్థన

ప్రభువు నిన్ను తన దూతల ఆధీనమున ఉంచును. నీవు ఎచటికి వెళ్లినను వారు నిన్ను కాపాడుచుందురు. నీ కాళ్ళు రాతికి తగిలి నొవ్వకుండునట్లు వారు నిన్ను తమ చేతులతో ఎత్తి పట్టుకొందురు. (కీర్తన 91, 11-12)

"నీవు భయపడకుము, నేను నీకు తోడై ఉందును. నీవు వెరవకుము, నేను నీకు దేవుడను. నేను నీకు బలము నొసగి నిన్ను ఆదుకొందును. నా శక్తితో నిన్ను కాపాడుదును." (యెషయా 41,10) అని వాగ్దానం చేసిన ప్రేమగల దేవా! మీ వాగ్దానమును విశ్వసించి ప్రయాణం చేయబోయే మమ్ము అనుగ్రహించండి. మార్గమధ్యలో మేము కలిసే ప్రతి వ్యక్తిలో మిమ్ము దర్శించే విశ్వాసం మాకు దయచేయండి. మా రాకపోకలయందు మాకు తోడుగా, నీడగా ఉండండి. ప్రమాదములు, ఆపదల నుండి మమ్ము కాపాడండి. నిర్భయంగా, సంతోష పూర్వకంగా పయనించి, సురక్షితంగా గమ్యం చేరుకునే అనుగ్రహం మాకు దయచేయండి. ఆమెన్.

### 3. చదువుకొనుటకు ముందు ప్రార్థన

దేవుని పట్ల భయభక్తులు చూపుట విజ్ఞానమునకు మొదటి మెట్టు. పవిత్రుడైన ప్రభువుని తెలుసు కొనుటయే వివేకము. (సామెతలు 9,10)

సకల విజ్ఞానమునకు నిలయమైన దేవా! చదువుకునే అవకాశం నాకిచ్చినందుకు నీకు వందనములు అర్పిస్తున్నాను. నేను చదువుకునే వేళలో నన్ను ఆశీర్వదించండి. మా విద్యాలయాన్ని, అధ్యాపకులను, సహ విద్యార్థులను దీవించండి. అధ్యాపకులు బోధించే విషయాలను, శ్రద్ధతో ఆలకించి, అర్థం చేసుకునే జ్ఞానం, ఏకాగ్రత నాకు దయచేయండి. అధ్యాపకులను దైవసమానులుగా భావించి గౌరవించే వినయం నాకు దయచేయండి. సహ విద్యార్థులకు తోడ్పడుటకు నన్ను బలపరచండి. ప్రభువా! మీరు జ్ఞానమందును, ప్రాయమందును వర్ధిల్లుచూ, దేవుని అనుగ్రహమును, ప్రజల ఆదరాభిమానములను పొందగలిగారు. నేను కూడా జ్ఞానమందును, ప్రాయమందును వర్ధిల్లుచూ, దేవుని అనుగ్రహమును, ప్రజల ఆదరాభిమానములను పొందునట్లు నన్ను దీవించండి. ఆమెన్.

**4. భోజనానికి ముందు ప్రార్థన**

ఆకాశపక్షులను పోషించు దయగల తండ్రీ! మాకవసరమైన ఆహారాన్ని దయచేసినందులకు మీకు వందనములు అర్పిస్తున్నాము. ఆకలిగొన్నవారందరికి ఆహారం దయచేయండి. మేము భుజింపబోయే ఆహారం కొరకు శ్రమించిన వారందరిని ఆశీర్వదించండి.
పిత, పుత్ర, పవిత్రాత్మ నామమున. ఆమెన్.

**5. గురువుల కొరకు ప్రార్థన**

నిత్యగురువులైన యేసు ప్రభూ! మీ గురువులను మీ పరిశుద్ధ హృదయమునందు సురక్షితముగా నుంచుకొనండి. మీ పవిత్ర శరీరమును తాకెడు వారి కరములను పావనముగా నుంచండి. మీ మహానీయ గురుపట్టముచే ముద్రింపబడిన వారి హృదయములకు లోక మలినము సోకనీయక, ఎల్లప్పుడును పరిశుద్ధముగా ఉండునట్లు చేయండి. మీ దివ్యప్రేమ వారిని లోకాశల నుండి కాపాడునుగాక. వారి ఆత్మలు మిగుల ఫలవంతమగునుగాక. వారి పరిచర్యను పొందువారు ఈ లోకములో వారికి ఆనందమును, ఊరటయును నొసగి, పరలోకములో వారికి నిత్యభాగ్యము యొక్క కిరీటముగా నుండ చిత్తగించండి. ఆమెన్.


## 6. రోగుల కొరకు ప్రార్థన

"వ్యాధిగ్రస్తులకే గాని ఆరోగ్యవంతులకు వైద్యుడు అక్కరలేదు" అని పలికిన కరుణామయుడైన దేవా ! మేము మిమ్ము స్తుతిస్తున్నాం, ఆరాధిస్తున్నాం. గ్రుడ్డి వారికి చూపును, చెవిటి వారికి వినికిడిని, మరణించిన వారికి నూతన జీవమును ప్రసాదించిన దేవా! అనారోగ్యముతో బాధపడుతున్న మా ఈ (సోదరుని/సోదరిని/ సోదరులను) స్వస్థపరచండి. "దేవుని ప్రేమించు వారికి అనగా ఆయన ఉద్దేశానుసారము పిలువబడిన వారికి, అన్నియు మంచికే సమకూరునట్లు దేవుడు చేయును" అని వాగ్దానము చేసిన మా దేవా, ఈ వ్యక్తి నిరాశ నిస్పృహలకు లోనుకాకుండా మీ యందు విశ్వాసము కలిగి జీవించుటకు అనుగ్రహం దయచేయండి. మీ దయగల హస్తమును చాపి సంపూర్ణమైన స్వస్థతను దయచేయండి. పరిపూర్ణమైన ఆరోగ్యమును ప్రసాదించండి. యేసు నామములో సంపూర్ణ విడుదలను, స్వస్థతను ఈ వ్యక్తి అనుభవించును గాక. ఈ వ్యక్తికి చికిత్స నందిస్తున్న వారిని, సేవ చేస్తున్న వారిని, కుటుంబ సభ్యులను ఆశీర్వదించండి. సకల పునీతుల ప్రార్థనలు తోడుగా నీడగా

నుండును గాక. మీ యందు పరిపూర్ణ విశ్వాసము కలిగి స్వస్థత పొందుటకు ఈ వ్యక్తిని బలపరచండి.
పిత పుత్ర పవిత్రాత్మ నామమున. ఆమెన్.

## 7. పరీక్షలకు వెళ్లేముందు చేయు ప్రార్థన

"నీవు భయపడకుము. నేను నీకు తోడై యుందును" అని పలికిన ప్రభువా, పరీక్ష వ్రాయడానికి సిద్ధమవుతున్న నన్ను ఆశీర్వదించండి. మీ జ్ఞానముతో నన్ను నింపండి. పరీక్షను విజయవంతముగా వ్రాయుటకు మీకు శక్తిని దయచేయండి. జ్ఞాపకశక్తిని అనుగ్రహించండి. నేర్చుకున్న విషయాలు పరీక్షా సమయములో జ్ఞాపకము ఉండునట్లు దీవించండి. పరీక్షను నిర్భయముగా, ప్రశాంతముగా వ్రాయుటకు ధైర్యమునివ్వండి. మీ పవిత్రాత్మ శక్తితో నన్ను అభిషేకించండి. సకల పునీతుల ప్రార్థనలు నాకు తోడుగా నుండును గాక. నాతో పాటు పరీక్షను వ్రాస్తున్న వారందరిని దీవించండి. పిత పుత్ర పవిత్రాత్మ నామమున. ఆమెన్.



# IV. కుటుంబ ప్రార్థన

(సాయంకాల సమయంలో కుటుంబ సభ్యులందరు కలిసి ప్రార్థించాలి. యేసునాథుని స్వరూపం ప్రతిష్ఠింపబడిన గదిలో దీపం వెలిగించి ప్రార్థన ప్రారంభించాలి. పవిత్రాత్మ గీతంతో కుటుంబ ప్రార్థన ప్రారంభించ వచ్చును.)

## 1. జపమాల

**ప్రారంభ ప్రార్థన:** అనంత సకల మేలుల స్వభావము కలిగిన ఏకత్రిత్వ సర్వేశ్వరా! మీ సన్నిధిలో ప్రార్థన చేయుటకు నేను ప్రాప్తుడనుగాను. అయినను మీ అనంతమైన కృపను నమ్ముకొని మీకు మహిమగాను దేవమాతకు స్తోత్రముగాను, ఈ ఏబది మూడు పూసల జపమును పరాకులేక భక్తితో చేసికొనుటకు మీ సహాయము దయచేయండి. సకల పుణ్యములకు విశ్వాస పుణ్యము మూలమై యుండుట వలన ముందుగా విశ్వాస సంగ్రహము వేడుకొందముగాక.

**జపమాల జపించు విధానం:**

1. విశ్వాస సంగ్రహం
2. పరలోక జపము
3. మంగళవార్త జపము (3సార్లు)
4. త్రిత్వ స్తోత్రము.

(ప్రతి రహస్యము తరువాత ఈ ప్రార్థన చెప్పవలెను.)

ఓ నా జేసువా, నా పాములను మన్నించండి. నరకాగ్ని నుండి మమ్ము కాపాడండి. సమస్త మానవాత్మలకు ముఖ్యముగా మీ కృప అత్యవసరమైన వారికి మీ దయారసము పాలించి మోక్షదరి చేర్చండి.

## 1. సంతోష దేవ రహస్యములు

(సోమ, శనివారము మరియు ఆగమనకాల ఆదివారములందును చెప్పదగును)

1. గాబ్రియేలు సన్మనస్కుడు దేవమాతకు మంగళవార్త చెప్పుటను గురించి ధ్యానించుదముగాక.
2. దేవమాత పునీత ఎలిజబేతమ్మను సందర్శించుటను గురించి ధ్యానించుదముగాక.
3. యేసు పుట్టుకను గురించి ధ్యానించుదముగాక.
4. బాలయేసును దేవాలయములో కానుకగా నొప్పగింపబడుటను గురించి ధ్యానించుదముగాక.
5. కానకపోయిన బాల యేసును దేవాలయములో కనుగొనుటను గురించి ధ్యానించుదము గాక.

## 2. వెలుగు దేవరహస్యములు

(గురువారములందు చెప్పదగును)


1. యేసు ప్రభువు యోర్దాను నదిలో యోహాను చేత బాప్తిస్మము పొందుటను గురించి ధ్యానించుదము గాక.
2. కానాపల్లె పెండ్లి విందులో యేసు నీటిని ద్రాక్షారసముగా మార్చుటను గురించి ధ్యానించుదము గాక
3. యేసు ప్రభువు దైవ రాజ్యమును, హృదయ పరివర్తనమును ప్రకటించుటను గురించి ధ్యానించుదము గాక
4. యేసు ప్రభువు తాబోరు పర్వతముపై దివ్యరూపధారణ చెందుటను గురించి ధ్యానించుదము గాక
5. యేసు ప్రభువు దివ్య సత్ప్రసాదమును స్థాపించుటను గురించి ధ్యానించుదము గాక



## 3. దు:ఖ దేవరహస్యములు

(మంగళ, శుక్ర మరియు తపస్సుకాల ఆదివారములందును చెప్పదగును)

1. యేసు గెత్సెమనె తోటలో రక్త చెమట చెమర్చుటను గురించి ధ్యానించుదముగాక
2. యూదులు యేసును రాతి స్తంభమునకు కట్టి కొట్టుటను గురించి ధ్యానించుదముగాక
3. యేసు శిరస్సుపై యూదులు ముండ్ల కిరీటము పెట్టి కొట్టుటను గురించి ధ్యానించుదముగాక.
4. యేసు సిలువను మోసుకొనిపోవుటను గురించి ధ్యానించుదముగాక.
5. యేసు సిలువలో కొట్టబడి మరణించుటను గురించి ధ్యానించుదముగాక.



## 4. మహిమ దేవరహస్యములు

(బుధ మరియు ఉత్థాన పండుగ నుండి ఆగమనకాల ప్రారంభము వరకు ఉన్న ఆదివారములలో చెప్పదగును)

1. యేసు పునరుత్థానమగుటను గురించి ధ్యానించుదముగాక.
2. యేసు మోక్షారోహణమగుటను గురించి ధ్యానించుదముగాక.
3. పవిత్రాత్మ సర్వేశ్వరుడు అపోస్తలులపై వేంచేసి వచ్చుటను గురించి ధ్యానించుదముగాక.
4. దేవమాత ఆత్మ శరీరములతో మోక్షమునకు కొనిపోబడుటను గురించి ధ్యానించుదముగాక.
5. దేవమాత పరలోక, భూలోకముల రాజ్ఞిగా స్థాపింపబడుటను గురించి ధ్యానించుదముగాక.

అతిదూతయగు పునీత మిఖాయేలా, దేవదూతయగు పునీత గాబ్రియేలా, అపోస్తలులైన పునీత పేతురు, యాకోబు, యోహాను అనెడువారలారా! మేమెంత పాపాత్ములుగా నుండినను మేము వేడుకొనిన ఈ ఏబది మూడు పూసల జపమును దేవమాత పాదముల చెంత మీ స్తోత్రములతో నొకటిగా జేర్చి కానుకగా సమర్పించుడని మిమ్ము ప్రార్థించుచున్నాము. ఆమెన్.

## దేవమాత ప్రార్థన

**ఏలినవారా! దయచూపండి**

**క్రీస్తువా! దయచూపండి**

**ఏలినవారా! దయచూపండి**

**క్రీస్తువా! మా ప్రార్థన వినవధరించండి.**

**క్రీస్తువా! మా ప్రార్థన ప్రకారము దయచేయండి.**

**పరలోకమందుండెడు పితయైన సర్వేశ్వరా!**

అం: మామీద దయగా నుండండి స్వామి

**లోకమును రక్షించిన పుత్రుడైన సర్వేశ్వరా,**

అం: మామీద దయగా నుండండి స్వామి

**పవిత్రాత్మ సర్వేశ్వరా,**

అం: మామీద దయగా నుండండి స్వామి

**మహా పరిశుద్ధ ఏక త్రిత్వ సర్వేశ్వరా,**

అం: మామీద దయగా నుండండి స్వామి

**పరిశుద్ధ మరియమ్మా, అం: మా కొరకు వేడుకొనండి**

సర్వేశ్వరుని యొక్క మాతా ”

కన్యకల యొక్క పరిశుద్ధ కన్యకా ”

క్రీస్తుని యొక్క మాతా ”

శ్రీ సభ యొక్క మాత ”

కనికరముగల మాత ”

దేవ వరప్రసాదము యొక్క మాతా ”

నిరీక్షణము యొక్క మాతా ”

మహా పరిశుద్ధ మాతా    అం: మా కొరకు వేడుకొనండి
మహా విరక్తిగా నుండెడు మాతా ”
నిర్మలమైన మాతా ”
కన్యత్వము చెడని మాతా ”
స్నేహమునకు తగిన మాతా ”
మహా స్తుతికి పాత్రమైన మాతా ”
మంచి ఆలోచన యొక్క మాతా ”
సృష్టికర్త యొక్క మాతా ”
రక్షకుని మాతా ”
మహా వివేకముగల కన్యకా ”
మహా పూజ్యమైన కన్యకా ”
స్తుతింపబడ యోగ్యమైన కన్యకా ”
శక్తిగల కన్యకా ”
దయగల కన్యకా ”
విశ్వాసము గల కన్యకా ”
ధర్మము యొక్క అద్దమా ”
జ్ఞానము యొక్క ఆలయమా ”
మా సంతోషము యొక్క కారణమా ”
జ్ఞాన పాత్రమా ”
మహిమకు తగిన పాత్రమా ”

అత్యంత భక్తి యొక్క పాత్రమా అం: మాకొరకు వేడుకొనండి
దేవ రహస్యముగల రోజా పుష్పమా ”
దావీదుని యొక్క గోపురమా ”
దంతమయమైన గోపురమా ”
స్వర్ణమయమైన ఆలయమా ”
వాగ్దాత్తము యొక్క మందసమా ”
మోక్షము యొక్క వాకిలీ ”
ఉదయకాల నక్షత్రమా ”
వ్యాధిగ్రస్తులకు ఆరోగ్యమా ”
పాపాత్ములకు శరణమా ”
వలస ప్రజల ఆదరువా ”
కష్టపడెడువారలకు ఆదరువా ”
క్రైస్తవుల యొక్క సహాయమా ”
సన్మనస్కుల యొక్క రాజ్ఞీ ”
పితరుల యొక్క రాజ్ఞీ ”
దీర్ఘదర్శుల యొక్క రాజ్ఞీ ”
అపోస్తులుల యొక్క రాజ్ఞీ ”
వేదసాక్షుల యొక్క రాజ్ఞీ ”
స్తుతీయుల యొక్క రాజ్ఞీ ”
కన్యకల యొక్క రాజ్ఞీ ”

సకల పునీతుల యొక్క రాజ్ఞీ అం: మాకొరకు వేడుకొనండి
జన్మ పాపము లేక ఉద్భవించిన రాజ్ఞీ ”
మోక్షమునకు కొనిపోబడిన రాజ్ఞీ ”
పరిశుద్ధ జపమాల రాజ్ఞీ ”
కుటుంబముల యొక్క రాజ్ఞీ ”
సమాధానము యొక్క రాజ్ఞీ ”

**ఒ: సర్వేశ్వరుని గొఱ్ఱెపిల్లా! లోకము యొక్క పాపములను పరిహరించెడు వారా**

అం: మా పాపములను మన్నించండి స్వామి.

**ఒ: సర్వేశ్వరుని గొఱ్ఱెపిల్లా! లోకము యొక్క పాపములను పరిహరించెడు వారా**

అం: మా ప్రార్థన ప్రకారము దయచేయండి స్వామీ

**ఒ: సర్వేశ్వరుని గొఱ్ఱెపిల్లా! లోకము యొక్క పాపములను పరిహరించెడు వారా**

అం: మా మీద దయగా నుండండి స్వామి

**ఒ: యేసుక్రీస్తు నాథుని దివ్య వాగ్దత్తములకు మేము పాత్రులమగునట్లు**

అం: సర్వేశ్వరుని యొక్క పరిశుద్ధ మాతా మా కొరకు ప్రార్థించండి.

**ప్రార్థించుదము:** జగద్రక్షకుడైన యేసువా, మీ స్లీవ క్రింద నిలిచియుండిన మీ దివ్యమాతను మీ ప్రియ శిష్యునికి తల్లిగా పాలించితిరే. ఇదిగో మాకును ఇంతటి అనుగ్రహమును దయచేసి దేవరవారు కాల ప్రమాణ మందు నిజమైన మనుష్యుడై జన్మించి తెలుసుకొనినటువంటి అమ్మ యొక్క బిడ్డలుగా నుండెడు భాగ్యమును మాకెప్పటికిని ప్రాప్తింపచేయనవధరించండి స్వామి. ఆమెన్.



## కృపారస మాత జపము

కృపారసముగల మాతయై యుండెడు రాజ్ఞీ! వందనము మా జీవమా, మా మధురమా, మా శరణమా! వందనము. పరదేశులమై యుండెడు మేము ఏవ యొక్క బిడ్డలము, మిమ్ము జూచి మొరపెట్టుచున్నాము. ఈ కన్నీటి కనుమయందు ప్రలాపించి యేడ్చెడు మేము మిమ్ము చూచి నిట్టూర్పు విడుచుచున్నాము. అందువలన మా కొరకు మనవి చేసెడు తల్లీ! మీ దయారసముగల కన్నులను మా మీద త్రిప్పనవధరించండి. ఇదిగాక ఈ పరదేశము గడచిన తరువాత ఆశీర్వదించబడిన మీ గర్భఫలమగు యేసు నాధుని ప్రత్యక్షమైన దర్శనమును మాకియ్య నవధరించండి. కృపగలగిన తల్లీ! దయారసము గలిగిన తల్లీ! ఓ మధురమైన కన్య మరియమ్మా! ఆమెన్.

## పాటలు

(మంగళవార్త ప్రార్థన గాన రూపంలో)

1. అనుగ్రహీత మరియమాతా యేసుదేవుని తల్లివే
   స్త్రీలలో పరిపూర్ణివే!
   రోగుల, పాపుల, దీనుల కోసము
   ప్రార్థన చేయుము, మరియమాతా.

2. వందనం మరియమాతా, స్త్రీలలో అనుగ్రహీత,
పావన జనని నీవు, దైవ కుమారుని తల్లి!
పాపరహితమైన మరియ, యేసుదేవునీ జనని,
పాపులైన మా కొరకు ప్రార్థించండి సర్వదా!

3. కృప నిండు మరియా, స్త్రీలలో ధన్యురాలా,
మీ గర్భఫలమగు, యేసువు ధన్యుడగు!
యేసుని తల్లీ మాతా, ప్రార్థించు మా కొరకు
ఇప్పుడు ఎల్లప్పుడు, మృత్యు వచ్చు వేళలో!

4. కృప నిండిన మాతా
మేరి నీ నామం
నిత్యం పొగడెదము
పరిశుద్ధ కన్య మరియమ్మ
పాపులమైన మా కొరకు
ప్రార్థించండి ఇప్పుడును
మా మరణ సమయములో



# ౨. దివ్య కారుణ్య జపమాల

(సాధారణ జపమాల పూసలపై)

ప్రారంభము : సిలువ గురుతు

పరలోక జపము

మంగళ వార్త జపము

విశ్వాస సంగ్రహము

**(పరలోక జపము చెప్పే పూసలపై ఈ క్రింది ప్రార్థన చెప్పాలి)**

"నిత్యపితా! మీ దివ్యకుమారుడును, మా ప్రభువైన యేసుక్రీస్తు యొక్క దివ్య శరీర, రక్తములను, ఆత్మను, దైవత్వమును, మా పాపముల పరిహారార్థము, సకల మానవుల పాపముల పరిహారార్థము మీకు సమర్పించుచున్నాము."

**(మంగళ వార్త జపమునకు బదులుగా చెప్పవలసిన ప్రార్థన)**

**దు:ఖపూరితమైన యేసు ప్రభుని శ్రమలు, మరణము ద్వారా**
మా మీదను సమస్త మానవాళి మీదను దయగా నుండండి

**(ఐదు గుర్తులు ముగిసిన తరువాత మూడు సార్లు చెప్పవలసిన ప్రార్థన)**

**పరిశుద్ధుడును, సర్వశక్తి మంతుడును నిత్యుడైన దేవా!**
మా మీదను, సమస్త మానవాళి మీదను దయగా నుండండి!

## ముగింపు ప్రార్థన

"శాశ్వతుడైన దేవా! అనంత కృపా సంపన్నుడా! అంతులేని కనికరము గల తండ్రీ మాపై నీ కరుణను అధికము చేయుము. తద్వారా మేము కష్ట సమయములలో, నిరాశ నిస్పృహలకు గురికాకుండా, గొప్ప నమ్మికతో, ప్రేమ, కరుణ అయిన నీ పవిత్ర చిత్తమునకు లోబడి జీవించుదముగాక. ఆమెన్

## 3. పవిత్ర గ్రంథ పఠనము

దైవవాక్యమునకు సంబంధించిన పాట పాడవచ్చును. అనంతరం దైవార్చన క్యాలండర్ నుండి ఆ రోజుకు సంబంధించిన సువార్త పఠనమును చదువవలెను. తరువాత రెండు నిమిషములు మౌనంగా వాక్యాన్ని ధ్యానించవలెను.

## 4. వేడుదల ప్రార్థన

1. ప్రభువైన యేసువా! మేము జ్ఞానస్నానములో మీతో చేసిన వాగ్దానమును నూతన పరచుకొనుచున్నాము. పాప జీవితానికి దారితీసే ఆలోచనలు, సంభాషణలు, కార్యములు ఈ కుటుంబములో ప్రవేశించకుండ మమ్ము కాపాడుమని మేము మిమ్ము వేడుకొనుచున్నాము.

అం.ప్రభువా, మా ప్రార్థన ఆలకించండి.

2. నేను మిమ్ము ప్రేమించినట్లు మీరును ఒకరినొకరు ప్రేమించుకొనుడని మీరు మమ్ము ఆదేశించారు. ప్రభువా! మీ ప్రేమ, మా కుటుంబములో నిలుచునుగాక. పరస్పర ప్రేమకలిగి, పరస్పర సహాయ సహకారాలు అందిస్తూ, సంతోషముగా జీవించే అనుగ్రహం మాకు దయచేయుమని మేము మిమ్ము వేడుకొనుచున్నాము.

అం.ప్రభువా, మా ప్రార్థన ఆలకించండి.

3. మా జీవితాలను మీకు సమర్పించుకొని తిరుకుటుంబ సుమాతృకలో మీకు పూర్ణ విధేయత కలిగి జీవించు భాగ్యమును మాకనుగ్రహించుమని మేము మిమ్ము వేడుకొనుచున్నాము.

అం. ప్రభువా, మా ప్రార్థన ఆలకించండి.

4.ప్రభువా! మీరు ఆదర్శ బాలునిగ జ్ఞానమందును, ప్రాయమందును వర్ధిల్లుచూ, దేవుని అనుగ్రహమును, ప్రజల ఆదరాభిమానములను పొందుచు జీవించారు. మా కుటుంబములోని పిల్లలు కూడ మీ కృపను బట్టి మంచి ఆరోగ్యము, ఆదర్శ జీవితము కలిగి ఉండుటకు అనుగ్రహం దయచేయుమని మేము మిమ్ము వేడుకొనుచున్నాము.

అం. ప్రభువా, మా ప్రార్థన ఆలకించండి.

5.ప్రభువా! మా అనుదిన జీవితములోని దు:ఖదురితములు, పనిపాట్లు అనే సిలువను మోయుటకు మాకు ఓర్పును, శక్తిని ప్రసాదించుమని మేము మిమ్ము వేడుకొనుచున్నాము.

అం. ప్రభువా, మా ప్రార్థన ఆలకించండి.

(గమనిక: సందర్భోచిత ఇతర ప్రార్థనలు ఈ సమయంలో చెప్పవచ్చును)

**5. యేసునాథుని తిరుహృదయమునకు సమర్పించు జపము**

యేసు నాథుని దివ్య హృదయమా, మా కుటుంబమును, కుటుంబ సభ్యులను మీకు సమర్పించుచున్నాము. మా కుటుంబములో మీరే రాజుగా నుండి మా ప్రవర్తనములన్నియు మీరు ఆధీన పరుచుకొనండి. మేము చేయు కార్యములను ఆశీర్వదించి, మా సంతోషములను పరిశుద్ధ పరచి, దు:ఖములో ఓదార్పును దయచేయండి. మాలో ఎవరైనను మిమ్ము నొప్పించిన యెడల మా తప్పులను క్షమించండి. ఈ కుటుంబములో నున్నవారందరిని, ఇక్కడ నుండి దూరముగా నున్న వారందరిని సమృద్ధిగా అనుగ్రహించండి. మరణించిన మా కుటుంబ సభ్యులను నిత్య సౌభాగ్యంలోనికి ప్రవేశింప జేయండి. మీ వద్ద చేరువరకు ఆత్మ సంబంధమును శారీరికమునైన సకల ఆపదల నుండి మమ్ము రక్షించండి.

పరిశుద్ధ మరియ తల్లి యొక్క విమల హృదయము, మా తండ్రియైన పునీత యోసేపు గారు మా కుటుంబ సమర్పణను మీకు అర్పించి జీవిత కాలమంతయు దీని సజీవ స్మరణ మాలో నిలిపి ఉంచుదురు గాక. ఆమెన్.

## 6. ముగింపు ప్రార్థన

ప్రేమగల తండ్రీ! మా ఈ ప్రార్థనలను మేము మీకు సమర్పించుచున్నాము. మీ దివ్యకుమారుడును మా రక్షకుడునైన యేసుక్రీస్తు ద్వారా ఈ మనవులను మాకు దయచేయండి. మరియు ఆయన ఉత్థానఫలమగు నిత్యమహిమను మేము పొందునట్లుగా మమ్ము అనుగ్రహించండి. ఆమెన్.



# ౫. పరిశుద్ధ సిలువ మార్గము

## పీఠమునకు ముందు వేడుకొను జపము

నా రక్షకుడా! యూదులు మిమ్ము హత్య చేయుటకు తీసుకొనిపోయిన ఈ కఠిన మార్గమందు నా మీదగల ప్రేమ వలన మీరు అత్యంత ప్రేమతో నడిచితిరి. నేను ఎన్నియో మారులు మిమ్ము ఎడబాసిపోతిని! ఇప్పుడైనను పరిపూర్ణాత్మతో మిమ్మును ప్రేమించుచున్నాను. మీకు ద్రోహము చేసినందున నిండు మనస్తాపముగానున్నాను. నా తప్పులను మన్నించండి. ఈ దు:ఖ మార్గమందు మిమ్మును వెంబడించి వచ్చుటకు నాకు అనుగ్రహము దయచేయండి. నా మీద మీకు గల ప్రేమ కొరకు చావవలెనని కోరుచున్నాను. మీ ప్రేమతో మరణము పొందను ఆశించుచున్నాము. ఆమెన్.

**పాట:** యేసునాథుదుర్వ్రిలోను
గాసి జెంది ప్రేమ మీర
దాసులన్ రక్షించెను.

## మొదటి స్థలము

## యేసునాధుడు మరణతీర్పు పొందుట

ఒ:యేసుక్రీస్తువా! మిమ్ము నారాధించి మీకు స్తోత్రము చేయుచున్నాము.

అం: ఏలయనగా మీ తిరు స్లీవ చేత లోకమును రక్షించితిరి.

యేసుప్రభువు రాతి స్తంభమున దెబ్బలు పొంది, ముండ్ల కిరీటము ధరింపజేయబడిన వెనుక పిలాతునిచే అన్యాయముగా సిలువలో మరణము పొందుటకు విధింపబడుటను ధ్యానించుదము గాక.

(కొంత సేపు ధ్యానము)

నా రక్షకుడైన యేసువా! మిమ్ము మరణదండనకు విధించిన వాడు పిలాతుడు కాడు. నా పాపములే మిమ్ము అట్టి తీర్పునకు లోజేసెను. ఈ దు:ఖకరమైన సిలువ మార్గము యొక్క ఫలమును చూచి నిత్యజీవమునకు పోవు మార్గములో నా ఆత్మకు తోడుగా నుండండి. సకల వస్తువుల కంటే మిమ్ము అధికముగా ప్రేమించుచున్నాను. మీకు ద్రోహము చేసినందు వలన నిండు మనస్సుతో దు:ఖించుచున్నాను. ఆమెన్

(1 పర, 1 మంగళ, 1 త్రిత్వ)

ఒ : మా మీద దయగానుండండి స్వామి.

అం : మా మీద దయగానుండండి స్వామి.

**పాట :** భారమైన స్లీవమ్రాను
క్రూరులైన యూద జాతి
వారు యేసు కెత్తిరి

## రెండవ స్థలము

## యేసుప్రభువు సిలువను మోయుట

ఒ : యేసుక్రీస్తువా! మిమ్ము నారాధించి మీకు స్తోత్రము చేయుచున్నాము.

అం : ఏలయనగా మీ తిరు స్లీవ చేత లోకమును రక్షించితిరి.

యేసు ప్రభువు తన భుజము మీద స్లీవను మోసికొనుపోవు సమయమున మనలను తలంచి, తాను పొందబోవు పాటులను, మరణమును మన కొరకు తన తండ్రికి సమర్పించుటను ధ్యానించుదుముగాక. (కొంత సేపు ధ్యానము)



నా రక్షకుడైన యేసువా! మరణకాలము వరకు మీరు నాకు విధించు దురితములను చేకొని నా పాపముల కొరకు ఉత్తరింపుగా మీకు ఒప్పగించుచున్నాను. ఓర్పుతోను, పూర్ణ పరిత్యాగముతోను నా సిలువను మోసికొనుటకు నాకు కావలసిన సహాయము దయచేయవలయునని మిమ్ము ప్రార్థించుచున్నాను. ఆమెన్.

(1 పర, 1 మంగళ, 1 త్రిత్వ)

ఒ : మా మీద దయగానుండండి స్వామి.

అం : మా మీద దయగానుండండి స్వామి.

**పాట :** మమ్ము బ్రోవ ప్రేమనంత
కుమ్మరించ వేడినాము
మిమ్ము నేక దీక్షతో

## మూడవ స్థలము

## యేసుప్రభువు మొదటిసారి స్లీవ క్రింద బోర్లపడుట

ఒ : యేసుక్రీస్తువా! మిమ్ము నారాధించి మీకు స్తోత్రము చేయుచున్నాము.

అం : ఏలయనగా మీ తిరు స్లీవ చేత లోకమును రక్షించితిరి.

నా రక్షకుడైన యేసువా! మీరు రాతి స్తంభమున పొందిన దెబ్బల వలన మీ దేహమంతయు గాయపరుప బడియుండెను. మీ దేహములో నుండి రక్తము ధారాళముగా కారిపోయినందున నడుచుటకు శక్తి లేనంత బలహీనత ఏర్పడెను. ఐనను మీ భుజముల మీద భారమైన గొప్ప ప్రమానును మోయవలసి యుంటిరి. సైనికులు వారిని కొట్టినందున ఇట్లు పలుమార్లు నేలమీద పడిరని ధ్యానించుదుముగాక. (కొంత సేపు ధ్యానము)

నా రక్షకుడైన యేసువా! నిన్నింతగా బాధ పెట్టినది స్లీవ భారము కాదు. నా పాపముల భారమే. ఈ మొదటి సారి పడుట యొక్క ఫలమును చూచి నేను పాపములో పడకుండ నన్ను కాపాడండి. ఎల్లప్పుడు నేను మిమ్ము ప్రేమింప అనుగ్రహము దయచేయండి. ఆమెన్.

(1 పర, 1 మంగళ, 1 త్రిత్వ)

ఒ : మా మీద దయగానుండండి స్వామి.

అం : మా మీద దయగానుండండి స్వామి.

పాట : దేవమాత దీనురాలై
దైవపుత్రున్ వెంబడించె
స్లీవ మోయుచుండగా

## నాల్గవ స్థలము

## యేసుప్రభువు తమ దివ్యమాతకు ఎదురుపడుట

ఒ : యేసుక్రీస్తువా! మిమ్ము నారాధించి మీకు స్తోత్రము చేయుచున్నాము.

అం : ఏలయనగా మీ తిరు స్లీవ చేత లోకమును రక్షించితిరి.

ఈ ప్రయాణము నందు కుమారుడును, తల్లియును అనుభవించిన దు:ఖమును ధ్యానించుదముగాక. వారల చూపులు ప్రేమతో నిండిన ఇరు హృదయములను పొడిచి తెరచిన అంబుల పోలియుండెను. (కొంత సేపు ధ్యానము)

నా రక్షకుడైన యేసువా! ఈ దర్శనమునందు మీరును తల్లియును అనుభవించిన బాధను చూచి మీ పరిశుద్ధ మాత మీద నాకు నిజమైన భక్తిని, ప్రేమను పుట్టించ కరుణించండి. వ్యాకుల సముద్రములో మునిగియుండు నా రాజ్ఞీ, మీ దివ్యకుమారుని పాటులను నేను నిరంతరము భక్తితో స్మరించునట్లు నా కొరకు మనవి చేయండి. సకల పాపములను విడిచి పెట్టుటకు ఈ పాటుల ధ్యానముచేత

నాకు జ్ఞాన బలము కలుగునట్లును నేను మీతో సదాకాలము మోక్షములో మీ దివ్యకుమారుని దర్శింప భాగ్యము పొందునట్లు ప్రార్థించండి. ఆమెన్.

(1 పర, 1 మంగళ, 1 త్రిత్వ)

ఒ : మా మీద దయగానుండండి స్వామి.

అం : మా మీద దయగానుండండి స్వామి.

**పాట :** తల్లి యేసునాథున్ గాంచి
తల్లడిల్లి సొమ్మసిల్లె
నుల్ల మెల్ల నీరయ్యేన్

## ఐదవ స్థలము

## యేసుప్రభువు సిలువను మోయుటకు కురేనియా సీమోను తోడ్పడుట

ఒ : యేసుక్రీస్తువా! మిమ్ము నారాధించి మీకు స్తోత్రము చేయుచున్నాము.

అం : ఏలయనగా మీ తిరు స్లీవ చేత లోకమును రక్షించితిరి.

ఇచ్చట యూదుల కఠోర చిత్తమును యోచించుదము గాక. ఒక్కొక్క అడుగునకు యేసుప్రభువు జీవమును విడిచెడి వారివలె ఉండుటను దుష్ట యూదులు చూచి, వారిని స్లీవలో కొట్టి అవమానముగా చంపవలెనని తలంచుచుండగా,

త్రోవలోనే మృతి పొందుదురేమోనని చింతించి వారి వెనుక స్లీవను మోసికొని వచ్చుటకు కురేనియా సీమోనుని బలవంతము చేసిరి. (కొంత సేపు ధ్యానము)


నా రక్షకుడైన యేసువా! నేను నా స్లీవను పోద్రోయక ఆలింగనము చేయుచున్నాను. ముఖ్యముగా మీరు నాకు నియమించిన మరణమును, మరణ సంకటమును చేకొని మీ మరణముతో నొకటిగా జేర్చి మీకు ఒప్పగించుచున్నాను. నా నిమిత్తము మీరు మృతి పొందితిరి. నేను మీ నిమిత్తము మృతి పొంద అనుగ్రహము పాలించండి. ఆమెన్

(1 పర, 1 మంగళ,1 త్రిత్వ)

ఒ : మా మీద దయగానుండండి స్వామి.

అం : మా మీద దయగానుండండి స్వామి.

**పాట :** గాసినొంది స్లీవ మోయు<br>
యేసుస్వామి మోము తుడ్చె<br>
వాసిగా వెరోనిక



## ఆరవ స్థలము

## వెరోనికమ్మ యేసుప్రభుని ముఖమును తుడుచుట

ఒ : యేసుక్రీస్తువా! మిమ్ము నారాధించి మీకు స్తోత్రము చేయుచున్నాము.

అం : ఏలయనగా మీ తిరు స్లీవ చేత లోకమును రక్షించితిరి.

వెరోనికమ్మ భక్తి అతిశయమును ధ్యానించుదముగాక. యేసుప్రభువు పొందిన శ్రమలను, చెమట చేత కాంతిహీనమైన వారి తిరు ముఖమును ఆ అమ్మ చూచి ఒక వస్త్రమును వారి చేతికియ్యగా ఆ వస్త్రముతో వారు తమ ముఖమును తుడుచుకొనినంత మాత్రమున వారి ముఖ పోలిక ఆ వస్త్రము మీద ముద్రింపబడెను.

(కొంత సేపు ధ్యానము)

నా రక్షకుడైన యేసువా! ముందు మీ తిరు ముఖము మిక్కిలి అందముగా నుండెను. కాని, ఇప్పుడు గాయములచేతను, రక్తముచేతను మారుపడి విరూపముగానున్నది. జ్ఞానస్నానములో నేను మీ ఇష్ట ప్రసాదమును పొందినప్పుడు నా ఆత్మయు మిక్కిలి అందముగా నుండెను. ఐనను పాపములచేత దానిని చెడగొట్టు కొంటిని. మీరు మాత్రమే దానిని తిరిగి సౌందర్య

వంతముగ చేయ శక్తులైయున్నారు. మీ తిరు పాటులను చూచి దానిని చక్కపరచండి. ఆమెన్

(1 పర, 1 మంగళ, 1 త్రిత్వ)

ఒ : మా మీద దయగానుండండి స్వామి.

అం : మా మీద దయగానుండండి స్వామి.

**పాట :** క్రూర యూద గుంపు యేసున్
ఘోర రీతి పట్టికొట్టి
మేరలేక మోదిరి

## ఏడవ స్థలము

## యేసుప్రభువు రెండవసారి సిలువ క్రింద బోర్లపడుట

ఒ : యేసుక్రీస్తువా! మిమ్ము నారాధించి మీకు స్తోత్రము చేయుచున్నాము.

అం : ఏలయనగా మీ తిరు స్లీవ చేత లోకమును రక్షించితిరి.

యేసుప్రభువు రెండవసారి స్లీవ క్రింద పడుటను యోచించుదముగాక. ఈ పాటుల వలన వారి తిరు శిరస్సునందును అవయములందును గల గాయములలో మరల నొప్పి కలిగెను. (కొంత సేపు ధ్యానము)

నా రక్షకుడైన యేసువా! మీరు ఎన్నియో మారులు నాకు మన్నింపు దయచేసియున్నప్పటికీ నేను లెక్కలేని మారులు మళ్ళీ పాపములో పడి మీకు ద్రోహము చేసితిని. హా! యేసువా! ఇకనైన నా మరణ పర్యంతము మీ అనుగ్రహమునందు స్థిరముగా నుండుటకు కావలసిన సహాయమును ఈ రెండవ పాటును చూచి నాకు దయచేయండి. నాకు వచ్చెడి సకల శోధనలయందు సదా నేను మీ శరణు జొచ్చుటకు అనుగ్రహము పాలించండి. ఇక ఏనాటికి మిమ్ము ఎడబాయకుండునటుల చేయండి. ఆమెన్

(1 పర, 1 మంగళ, 1 త్రిత్వ)

ఒ : మా మీద దయగానుండండి స్వామి.

అం : మా మీద దయగానుండండి స్వామి.

**పాట :** కోరిపాపపుంజమెల్ల
పారద్రోల యేసుస్వామి
క్రూర బాధ నొందెను.

## ఎనిమిదవ స్థలము

## యేసుప్రభువు పుణ్య స్త్రీలకు ఊరట చెప్పుట

ఒ : యేసుక్రీస్తువా! మిమ్ము నారాధించి మీకు స్తోత్రము చేయుచున్నాము.

అం : ఏలయనగా మీ తిరు స్లీవచేత లోకమును రక్షించితిరి.

యేసుప్రభువు నడిచిపోవు మార్గమున వారి దేహములో నుండి రక్తము ప్రవాహముగా పారునప్పుడు కొందరు స్త్రీలు వారిని ఇంత పరితాపకరమగు స్థితియందు చూచి కనికరపడి ఏడ్చిరి. యేసు వారల ఏడుపును చూచి ఊరట చెప్పి వారలతో, "యెరూషలేము కుమార్తెలారా! నా నిమిత్తము ఏడువక మీ నిమిత్తము, మీ బిడ్డల నిమిత్తము ఏడవండి" అని మందలించిరి. (కొంత సేపు ధ్యానము)

నా రక్షకుడైన యేసువా! నేను చేసిన పాపములకు మన్నింపు దయచేసి ఊరట పాలించండి. మీకు విరుద్ధముగా నేను కట్టుకొనిన ద్రోహముల నిమిత్తము దు:ఖించుచున్నాను. నన్ను ఇంతగా ప్రేమించిన మీకు నా పాపముల చేత రప్పించిన బాధను గూర్చి చింతించుచున్నాను. నరక వేదనల భయము వలన నాకు కలుగు దు:ఖముకన్న మీ యెడల నాకు గల ప్రేమవలన అధిక దు:ఖము కలుగుచున్నది. ఆమెన్

(1 పర, 1 మంగళ, 1 త్రిత్వ)

ఒ :మా మీద దయగానుండండి స్వామి.

అం :మా మీద దయగానుండండి స్వామి.

**పాట :** స్లీవ మోయు శక్తి లేక
త్రోవయందు క్రిందగూలె
లేవలేక యేసువు

## తొమ్మిదవ స్థలము

## యేసుప్రభువు మూడవసారి సిలువ క్రింద బోర్లపడుట

ఒ : యేసుక్రీస్తువా! మిమ్ము నారాధించి మీకు స్తోత్రము చేయుచున్నాము.

అం : ఏలయనగా మీ తిరు స్లీవ చేత లోకమును రక్షించితిరి.

యేసు ప్రభువు మూడవసారి స్లీవ క్రింద బోర్లపడుటను యోచించుదముగాక. గాయముల వల్ల వారు బలహీనులైరి. సైనికుల నిష్ఠూరము మితము మించి యుండెను. ప్రభువుకు కదులటయే కష్టముగా నుండినను శీఘ్రముగా నడువవలెనని వారు తొందర చేయుచుండిరి.

(కొంత సేపు ధ్యానము)

నా రక్షకుడైన యేసువా! మీ ప్రేమను తిరస్కరింప జేసిన నా దుర్గుణములను ఈ లోకాశలను జయించుటకు మీరు కపాల కొండకు పోవునపుడు పొందిన బలహీనత యొక్క ఫలమును చూచి నాకు వర ప్రసాదములను దయచేయండి.

నేను బలహీనుడనైయున్నాను. నా సొంత బలము చేత పాపములను విడిచి పెట్టలేను. మీ సహాయ ప్రసాదములను నాకు యిచ్చిన యెడల ఇక ఏనాటికి పాపములో పడను. ఆమెన్

(1 పర, 1 మంగళ, 1 త్రిత్వ)

ఒ : మా మీద దయగానుండండి స్వామి.

అం : మా మీద దయగానుండండి స్వామి.

**పాట :** ఒంటనున్న గాయమంత
నంటగా వస్త్రాలనెల్ల
గెంటినీడ్చి లాగిరి

## పదవ స్థలము

## యేసుప్రభువు యొక్క వస్త్రములను ఒలుచుట

ఒ : యేసుక్రీస్తువా! మిమ్ము నారాధించి మీకు స్తోత్రము చేయుచున్నాము.

అం : ఏలయనగా మీ తిరు స్లీవ చేత లోకమును రక్షించితిరి.

సైనికులు యేసుప్రభువు వస్త్రములను ఒలుచుటను ధ్యానించుదముగాక. వారి లోపలి వస్త్రములు, పగిలిన వారి శరీరముతో కరుచుకుని యుండినను క్రూరులు వాటిని మడ్డితనముగా పెరికినపుడు వస్త్రముతో మాంసము కూడ

ఊడి వచ్చెను. ఈ రీతిగా రక్షకుడు పడిన కఠోర వేదనను చూచి పరితపించుదము.

(కొంత సేపు ధ్యానము)


నా రక్షకుడైన యేసువా! ఈ సమయమందు మీరు మీ శరీరమంతటట పడిన బాధను చూచి, నేను నా శరీర సుఖములను వెదకకయుండుటకు విరక్తత్వమునకు విరుద్ధమైన పాపములను చేయక ఉండుటకు సహాయము చేయండి. మరియు ఈ ప్రపంచ వస్తువుల మీద నాకు గల ప్రేమనంతయు పెరికివేసి మీ మీద మాత్రము ప్రేమనుంచుటకు నాకు అనుగ్రహము దయచేయండి. ఆమెన్

(1 పర, 1 మంగళ, 1 త్రిత్వ)

ఒ : మా మీద దయగానుండండి స్వామి.

అం : మా మీద దయగానుండండి స్వామి.

**పాట :** జంట దొంగవార్ల మధ్య
మంట భారమైన స్లీవ
కంటగించి నాటిరి



## పదకొండవ స్థలము

## యేసుప్రభువు సిలువ మీద కొట్టబడుట

ఒ : యేసుక్రీస్తువా! మిమ్ము నారాధించి మీకు స్తోత్రము చేయుచున్నాను.

అం: ఏలయనగా మీ తిరు స్లీవ చేత లోకమును రక్షించితిరి.

యేసు ప్రభువును స్లీవమీద పరుండ బెట్టిన వెనుక, వారు తమ చేతులు చాచి మన రక్షణ కొరకు తమ నిత్య పితకు తమ జీవమును బలిగా ఒప్పగించినారని ధ్యానించుదముగాక. కిరాతకులు ఇనుప మొలలచేత వారిని సిలువకు అంటగొట్టి, ఆ స్లీవను నాటి, అవమానముగల ఆ ప్రాని మీద మహావేదనతో చావవిడిచిరి.

(కొంత సేపు ధ్యానము)

నా రక్షకుడైన యేసువా! నా హృదయమును మీ తిరుపాదములకు అంటగొట్టి అది ఇంక ఎన్నటికిని మిమ్ము విడువకుండ నుండుటకు నిరంతరము మీ పాదముల కాచుకొనియుండ చేయండి. నాకన్న అధికముగా మిమ్మును ప్రేమించుచున్నాను. మీకు ద్రోహము చేసినందుకు నిండు మనస్సుతో దు:ఖపడుచున్నాను. ఆమెన్.

(1 పర, 1 మంగళ, 1 త్రిత్వ)

ఒ : మా మీద దయగానుండండి స్వామి.

అం : మా మీద దయగానుండండి స్వామి.

**పాట :** నేడేయంత పూర్తియంచు
వేడి శ్రీ శిరంబువంచి
వీడీనారు ప్రాణము

## పన్నెండవ స్థలము

## యేసుప్రభువు సిలువ మీద మృతి పొందుట

ఒ : యేసుక్రీస్తువా! మిమ్ము నారాధించి మీకు స్తోత్రము చేయుచున్నాము.

అం:ఏలయనగా మీ తిరు స్లీవ చేత లోకమును రక్షించితిరి.

యేసుప్రభువు మూడు గంటలసేపు సిలువ మీద మహా ఆవేదన పొందిన వెనుక, ఉపద్రవము వలన పీడింపబడి, శరీర భారమున కృంగి, తలవంచి మరణించుటను ధ్యానించుదముగాక.

(కొంత సేపు ధ్యానము)

నా రక్షకుడైన యేసువా! నా మీద గల ప్రేమచేత మీరు మృతి నొందిన సిలువ మ్రానును భక్తితో ముద్దు పెట్టుకొనుచున్నాను. నా పాపముల వలన నిర్భాగ్యమైన

మరణము నాకు రావలసియుండెను. ఐనను మీ మరణము చేత నన్ను రక్షించితిరి. నా కొరకు మీరు ఈ ఘోరమైన బాధలు పొందినందు చేత నాకు మోక్ష భాగ్యము ఇచ్చుదురని నేను నమ్ముచున్నాను. మీ పాదములను కౌగలించుకొని మృతి పొందుటకు నాకు అనుగ్రహము దయచేయండి. నా ఆత్మను మీ చేతులలో అప్పగించుచున్నాను. ఆమెన్

(1 పర, 1 మంగళ, 1 త్రిత్వ)

ఒ : మా మీద దయగానుండండి స్వామి.

అం : మా మీద దయగానుండండి స్వామి.

**పాట :** బాధపెట్టు శత్రుగుంపు
నాదరించ వేడినాడు
నాథుడైన యేసువు.

## పదమూడవ స్థలము

## యేసుప్రభువు సిలువ నుండి దింపబడుట

ఒ : యేసుక్రీస్తువా! మిమ్ము నారాధించి మీకు స్తోత్రము చేయుచున్నాము.

అం: ఏలయనగా మీ తిరు స్లీవ చేత లోకమును రక్షించితిరి.

యేసు జీవమును విడిచిన వెనుక వారి శిష్యులగు యోసేపు, నికోదేమను వారలిద్దరు వారిని స్లీవ నుండి దించి దు:ఖముతో నిండిన వారి తల్లి చేతులలో నుంచిరి. ఆమె అధిక వేదనతో ఆ దివ్య శరీరమును కౌగలించుకొనుటను ధ్యానించుదముగాక. (కొంత సేపు ధ్యానము)

నా రక్షకుడైన యేసువా! మీరు నా నిమిత్తము మృతి పొందితిరి. కనుక నేను మిమ్ము ప్రేమించుటకు సహాయము చేయండి. మీరు మినహా నాకు కావలసిన దేమియు లేదు. మీ నిమిత్తము మృతి పొంద నేను ఆశించుచున్నాను. వ్యాకులభరితమైన మాతా! మీ ప్రియ కుమారుని మీద మీకు గల ప్రీతిని చూచి నన్ను మీ దాసునిగా చేకొని నా కొరకు ప్రార్థించండి. ఆమెన్

(1 పర, 1 మంగళ, 1 త్రిత్వ)

ఒ : మా మీద దయగానుండండి స్వామి.

అం : మా మీద దయగానుండండి స్వామి.

**పాట :** భాసురుండు మోక్షరాజు<br>
దాసులయిన పాపజాతి<br>
కోసమై మరణించెను

## పదునాల్గవ స్థలము

## యేసుప్రభుని శరీరమును సమాధిలో నుంచుట

ఒ: యేసుక్రీస్తువా! మిమ్ము నారాధించి మీకు స్తోత్రము చేయుచున్నాము.

అం: ఏలయనగా మీ తిరు స్లీవ చేత లోకమును రక్షించితిరి.

ప్రభు శరీరమును భూస్థాపనము చేయుటకు శిష్యులు మోసికొని పోవుటను, వారి పరిశుద్ధ తల్లి వెంబడిపోయి ఆ తిరు శరీరమును తానే సమాధిలో క్రమపరచుటను అటువెనుక ఆ సమాధిని మూసి అందరు వెడలిపోవుటను యోచించుదముగాక. (కొంత సేపు ధ్యానము)

నా రక్షకుడైన యేసువా! మీ మీద మూసియుండు రాతిని ముద్దు చేయుచున్నాను. మీరు మూడవనాడు జీవవంతులై లేచితిరిగదా! ఈ ఉత్థానమును చూచి లోకాంత్యమున నేను మీతో ఉత్థానమగుటకు, మోక్షము నందు మిమ్ము పొగడి ప్రేమించుటకు నాకు అనుగ్రహము దయచేయండి. ఆమెన్

(1 పర 1 మంగళ 1 త్రిత్వ)

ఒ : మా మీద దయగానుండండి స్వామి.

అం : మా మీద దయగానుండండి స్వామి.

**పాట:** పాపులయిన దీనులారా
దాపుచేరి కొల్వరండి
పాపదోష మీడునే

**జపము**

హా! రక్షకుడా! లోక రక్షణము కొరకు మీరు యూదుల వలన తిరస్కరింపబడను, ద్రోహియగు యూదా ముద్దువలన శత్రువులకు చూపింపబడను, అనాసు, కైఫాసు, పిలాతు, హేరోదు వారల ముందర అవమానముగా ఒప్పగింపబడను, అబద్ధ సాక్షుల వల్ల నేరము మోపబడను, కొరడాలతో కొట్టబడను, ఉమియబడను, మీ తలపై ముండ్ల కిరీటము పెట్టి, మీ వస్త్రములను తీసి మిమ్ము సిలువ మీద కొట్టి, ఈటె చేత పొడిచి తెరువబడను చిత్తగించితిరే. నేను మహా పాపిగా నుండినను నేను ఇప్పుడు స్మరణ చేసిన మీ తిరు మరణమును చూచి నరక బాధలలో నుండి నన్ను కాపాడండి. మరియు మీ ప్రక్క స్లీవ మీద కొట్టబడి మనస్తాప పడిన దొంగ వానిని తీసుకుపోయిన స్థలమునకు నన్నును తీసుకునిపొండి. ఆమెన్.

**పరిశుద్ధ పాపుగారి తలంపుల కొరకు ప్రార్థిద్దాం**

**1 పర, 1 మంగళ, 1 త్రిత్వ**

# 6. పాటలు

## పాట నెం. 1

**నేనును నా కుటుంబమును ప్రభుని మాత్రమే సేవింతుము**

మాకు ఏమి జరిగినను – ఎవరు ఏమి పలికినను

ప్రభువే మాకు ఆధారం – ప్రభువే మాకు ఆనందం (హల్లేలూయా 4)

1. ఎర్ర సముద్రము అడ్డువచ్చిన మేము భయపడము
దేవుని హస్తము కాపాడును - ఎల్లప్పుడు జీవింతుము (హల్లే 4)

2 యెరికో గోడలు ముందుండినా మేము భయపడము
దేవుని స్తుతించి ఆరాధింప – గోడలు కూలిపోవును (హల్లే 4)

## పాట నెం. 2

**యేసు మరియా యోసేపు – మా కుటుంబాన్ని కాపాడుమా**

ఎల్లప్పుడు దేవుని చిత్తం వెదకు – అనుగ్రహం కురిపించుమా

1. యేసు దేవా నీ హృదయానికి
మా కుటుంబాన్ని అర్పిస్తున్నాం
పరిశుద్ధ రక్తముతో కడిగి ఎల్లప్పుడు
మా కుటుంబాన్ని నడిపించుమా 2

2. అమ్మ మరియా నీ మాతృ ప్రేమను
భక్తితో మేము స్మరియించెదము
ఎల్లప్పుడు నిర్మల మనసుతో జీవింప
మాకై ప్రార్థన చేయుమమ్మా 2

3. యోసేపుగారా మా పాలక తండ్రి
మా కుటుంబాన్ని అర్పిస్తున్నాం
కన్నీటి బాధలలో ఉన్న మమ్ము - ఓదార్చి దయతో నడిపించుమా 2

## పాట నెం. 3

**ఆత్మ స్వరూపుడా నా యేసయ్యా**
నీ ఆత్మతో నను నింపుమా (2) - నీ ఆత్మ శక్తిని నా కొసగుమా (2)
పరిశుద్ధాత్మ దేవుడా నీ శక్తితో నింపుమా
పరిశుద్ధాత్మ దేవుడా నీ అగ్నిని పంపుమా (2)
పరిశుద్ధాత్మ దేవుడా నా పెదవులు కాల్చుమా
పరిశుద్ధాత్మ దేవుడా పరిశుద్ధత నీయుమా (2)
1. మండుచున్న పొదలో అగ్నివై
భక్తుడు మోషేతో మాట్లాడిన దేవా (2)
నాతో మాట్లాడవా - నన్ను నడిపించవా (2)
2. అంతిమ దినమున మాపై ఆత్మను
కుమ్మరించుటకు నిశ్చయించితివి (2)
మాపై దిగిరావయ్యా - శక్తిని ఒసగుమయా (2)

## పాట నెం. 4

**జననీ ఓ మరియా చల్లని మాతవమ్మా**
జీవితయానంలో మా తోడుగ నిలువుమమ్మా
1. శుభములు గూర్చు నీ నామం –నిరతము నాలో స్మరియింతు
మధురమే నీ ప్రేమ - ఎడబాయని నీ కరుణ

2. వెన్నెలవంటి నీ మమత - సుధలను నాలో కురిపించు
స్వర్గమే నీ హృదయం - కమనీయమె నీ వదనం
3. ఆశలు తీర్చు నీ జపము -ఆపదలో మా స్థిర శరణం
చెరగదు ఈ బంధం -విడిపోని అనుబంధం

**పాట నెం. 5**

**సత్యం జీవం మార్గం యేసే- యేసు నీవే - నీవే నీవే 2**

1. నిత్యం నిరతం సత్యం యేసే నీకు నాకు జీవం యేసే
భక్తికి ముక్తికి మార్గం యేసే
శక్తిని యుక్తిని ఒసగును యేసే
2. యేసుని మాట మాకిల బాట-ప్రభుని పాట ఇలపై ఊట
యేసుని వాక్యము వినగారండి
జాప్యము చేయక త్వరపడిరండి

**పాట నెం. 6**

**యుద్ధము యెహోవాదే** ॥2॥

1. రాజులు మనకెవ్వరు లేరు-శూరులు మనకెవ్వరు లేరు
సైన్యములకు అధిపతియైన యెహోవా మన అండ
2. ఎరికో గోడలు ముందుండినా-ఎఱ్ర సముద్రము ఎదురైనా
అద్భుత దేవుడు మనకుండగా-భయమేలా మనకింకా
3. వ్యాధులు మనలను పడద్రోసినా-బాధలు మనలను కృంగదీసిన
విశ్వాసమునకు కర్తయైన యేసయ్య మన అండ

## పాట నెం. 7

నువ్వంటె నాకెంతో ఇష్టమేసయ్యా
నువ్వు లేకుంటే బ్రతుకుటే కష్టమేనయ్య ॥2॥
చప్పట్లతో నిన్ను స్తుతియింతును
నాట్యముతో నిన్ను భజియింతును
స్తుతి ॥4॥ స్తోత్రమయ్య - నీకే -స్తుతి ॥4॥ సోత్రమయ్య
హల్లెలూయా హల్లెలూయా హల్లెలూయా ఆమెన్
హల్లెలూయా హల్లెలూయా హల్లెలూయ ॥నువ్వంటె॥

1. నాకు నీ రూపమునిచ్చావు స్తోత్రమయ్య
   నాకు నీ జీవము పోసావు స్తోత్రమయ్య
   నన్ను నీ లాగ మార్చావు స్తోత్రమయ్య
   నాలో నీ ప్రేమను నింపావు స్తోత్రమయ్య
2. నా కన్నులతో నీ రాకను చూసెదనయ్య
   నా కరములతో నీ క్రియలు చేసెదెనయ్య
   నా కాళ్ళతో నీ బాటలో నడిచెదనయ్య
   నా పెదవులతో నీ నామం పొగడెదనయ్యా

## పాట నెం. 8

**యేసే గొప్ప దేవుడు మన యేసే శక్తిమంతుడు**
యేసే ప్రేమపూర్ణుడు యుగయుగముల స్తుతిపాత్రుడు
కోరస్: స్తోత్రము మహిమ జ్ఞానము శక్తి
ఘనత బలము కలుగును ఆమెన్ ॥2॥

1. మహాశ్రమలలో వ్యాధి బాధలలో సహనము చూపి
   స్థిరముగ నిలిచిన యోబు వలనే జీవించెదను ॥2॥
   అద్వితీయుడు అదిసంభూతుడు
   ధీర్ఘశాంతుడు మన ప్రభు యేసే ॥2॥ ॥స్తోత్రము॥
2. ప్రార్థన శక్తితో ఆత్మ బలముతో లోకమునకు
   ప్రభువును చాటిన దానియేలు వలె జీవింతును
   మహోన్నతుడు మన రక్షకుడు
   ఆశ్రయదుర్గము మన ప్రభు యేసే ॥2॥ ॥స్తోత్రము॥

## పాట నెం. 9

**నీవుంటే నాకు చాలు యేసయ్యా**

నీవెంటే నేను వుంటానేసయ్యా

కోరస్: నీ మాట చాలయ్య నీ చూపు చాలయ్య
నీ తోడు చాలయ్య నీ నీడ చాలయ్య

1. ఎన్ని బాధలున్నను - ఇబ్బందలైననూ
   ఎంత కష్టమెచ్చినా - నిష్ఠూరమైననూ
2. బ్రతుకు నావ పగిలినా - కడలి పాలైననూ
   అలలు ముంచి వేసినా - ఆశలు అణగారినా
3. ఆస్తులన్ని పోయినా - అనాథగా మిగిలినా
   ఆప్తులే విడనాడినా - ఆరోగ్యం క్షీణించినా

## పాట నెం. 10

**శక్తితో కాదు బలముతో కాదు**

నీ ఆత్మ కార్యమేగా ప్రభు నీ ఆత్మ కార్యమేగా ॥2॥

హల్లెలూయా హల్లెలూయా – హల్లెలూయా హల్లెలూయా

1. అభిషేకించు అభిషేకించు – నీ ఆత్మతో అభిషేకించు
   బలపరచు బలపరచు – నీలో నన్ను బలపరచు
2. శుద్ధీకరించు శుద్ధీకరించు – ఈ పాపిని శుద్ధీకరించు
   తొలగించు తొలగించు – నా బంధనాలు తొలగించు
3. నా శక్తి శూన్యం నీ శక్తి శూన్యం –యుద్ధము యెహోవాదే
   నా పక్షమున దేవుడుండగా – విరోధి నాకెవ్వరూ

శక్తితో కాదు బలముతో కాదు–నీ ఆత్మ కార్యమేగా

ప్రభు నీ ఆత్మ కార్యమేగా

నా బుద్ధితో కాదు నా శక్తితో కాదు

నీ ఆత్మ కార్యమేగా ప్రభు నీ ఆత్మ కార్యమేగా

